క్లుప్తంగా

అప్పన్నకు బంగారు కాసుల హారం బహూకరణ



ఈవో శ్రీనివాసమూర్తికి బంగారు హారం అందజేస్తున్న దాత వరహాలరెడ్డి

సింహాచలం : సింహాచలం నృసింహ స్వామికి గురువారం నగరంలోని మధురవాడకు చెందిన మేడపాటి నరసింహ వరహాలరెడ్డి 15 గ్రాముల బంగారు కాసుల హారం, 750 గ్రాముల వెండి అష్టలక్ష్మి కలశ బహూకరించారు. వీటిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనానికి కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



కళాశాలలో అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: మానవ జాతి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు సామాజిక అడవుల పెంపకం అవసరమని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి పేర్కొన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. తాము చదివే కళాశాలలతో పాటు ఇంటి వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో విద్యార్థులు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టీఎంఏ నివేదిత, రసాయన శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ వీవీజే గోపాల కృష్ణ, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, ఎం.గోవిందరావు, బి.లక్ష్మి, లెక్కల గణేష్ పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాలు

పరవాడ: మండలంలో మంత్రిపాలెం జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రికార్డులు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. వీటి యజయానులు ఎవరైనా పరవాడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ



అంగన్‌వాడీ సిబ్బందికి ఫ్యాన్ అందిస్తున్న దేముడు

పెందుర్తి: వేపగుంట ముత్యమాంబ కాలనీ–1 అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక నివాసి గంట్ల దేముడు ఫ్యాన్ సమకూర్చారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఫ్యాన్‌ను దేముడు అంగన్‌వాడీ కార్యకర్త ఐ.రాజేశ్వరికి అందజేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

సబ్బవరం: ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పిన్నంటి రమణ గురువారం హెచ్చరించారు. సబ్బవరంలోని కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో కొందరు ఆకతాయిలు విద్యార్థినులను వెంబడించి ర్యాగింగ్‌కు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన కూడళ్లు, ఆటో స్టాండ్‌ల వద్ద పోలీస్‌ల నిఘా ఏర్పాటు చేశామన్నారు. బైకులపై అతివేగంగా వెళ్లేవారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

బ్రోకర్ల ఇష్టారాజ్యం

- ప్రభుత్వ స్థలాలు అమ్మేస్తున్న వైనం
- మోసపోతున్న బాధితులు
- షెడ్‌లు, పాకలు వేసుకున్నాక తొలగిస్తున్న అధికారులు



కార్మికనగర్‌లో అక్రమ నిర్మాణం



కార్మికనగర్‌లో చెరువును ఆక్రమించి నిర్మాణం

పెందుర్తి: 'అయ్యా పలానా సార్ మధ్యలో ఉండి కొనిపించారు. రూ.5–6 లక్షలు కాయకష్టం చేసుకుని దీని మీద పెట్టాను. మీరు ఇది కూల్చేస్తే మేం రోడ్డున పడతాం సార్. ఇక్కడికి ఏ అధికారి రాడని కొనేటపుడు బ్రోకర్ చెప్పారు. అంతా ఆ సార్ చూసుకుంటాడు అన్నాడు. ఇప్పుడేమో మొహం చాటేశాడు' తన షెడ్ కూల్చడానికి వచ్చిన రెవెన్యూ అధికారి వద్ద పెందుర్తికి చెందిన ఓ బాధితుడి ఆవేదన ఇది.. పేదోడి కష్టాన్ని భూ బ్రోకర్లు దోచుకుతింటున్నారు. కాయకష్టం చేసుకుని సంపాదించిన సొమ్మును ఈ మాయగాళ్లు కాజేస్తున్నారు. తలదాచుకోవడానికి నీడ కోసం జీవితాంతం చెమటోడ్చిన డబ్బును దారపోస్తే చివరకు కట్టుబట్టలే మిగులుతున్నాయి. పెందుర్తి, చినముషిడివాడ కార్మికనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను బ్రోకర్లు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా వేసి విక్రయాలు సాగిస్తున్నారు. కార్మికనగర్‌లో అయితే ఏకంగా చెరువునే పూర్తిగా మింగేస్తున్నారు. పేదలను నమ్మించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. బ్రోకర్లను నమ్మి పేదలు అక్కడ పాకలు, షెడ్‌లు వేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్మికనగర్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.



పెందుర్తిలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

డబ్బే లక్ష్యం..

పెందుర్తి ప్రాంతంలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. అయితే ఈ భూముల్లో కిందిస్థాయి అధికారుల అండతో కొందరు బ్రోకర్లు పాగా వేశారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లో అయితే చోటామోటా నాయకులు బ్రోకర్ల అవతారం ఎత్తుతున్నారు. ఖాళీ స్థలాలతో పాటు చెరువులు, కొండలు, ఇతర ప్రభుత్వ స్థలాలను వీరు చదును చేస్తున్నారు. అక్కడ గజాల చొప్పున ప్లాట్లు వేసి పేదోళ్లను బుట్టలోకి దించుతున్నారు. కూలీ పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నవారికి లక్ష్యంగా చేసుకుని వారిని నమ్మించేందుకు పత్రాలు కూడా సృష్టిస్తున్నారు. వాటిని చూపించి సదరు స్థలానికి ఒక రేటు నిర్ణయించి అమ్మేస్తున్నారు. ఒక్కో స్థలం రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

నష్టపోతున్న బాధితులు

సొంత గూడు లేని పేదలు బ్రోకర్ల మాటలు నమ్మి ప్రభుత్వ స్థలాల్లో స్థలాలు కొనుకుంటున్నారు. తమతమ స్తోమతను బట్టి పాకలు, షెడ్‌లు వేసుకుంటున్నారు. తీరా విషయం రెవెన్యూ అధికారులకు చేరడంతో అధికారులు వాటిని తొలగించి స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ సమయంలో అమ్మకాలు జరిపిన బ్రోకర్లు చేతులెత్తేయడంతో పేదలు ఇటు స్థలానికి చెల్లించిన డబ్బుతో పాటు నిర్మాణానికి వెచ్చించిన సొమ్మును కూడా నష్టపోతున్నారు.

ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేయవద్దు

ప్రభుత్వ స్థలాల సంరక్షణే మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఇక అమ్మకాల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేస్తే నష్టపోవడం తప్ప ఇంకేం ప్రయోజనం ఉండదు.

–బంగార్రాజు, తహశీల్దారు, పెందుర్తి

ఘనంగా శిక్షా సప్తాహ్



పలు వేషధారణల్లో ఉన్న విద్యార్థులతో చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం : జీవీఎంసీ 98వవార్డు పరిధి సింహాచలేనగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఝాన్సీరాణి, మదర్ థెరిసా, అల్లూరి సీతారామరాజు, సావిత్రిబాయిపూలే, సరోజినినాయుడు వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

అలాగే చెట్లు–ఉపయోగాలను తెలియజేస్తూ విద్యార్థులు చేసిన మోనో యాక్షన్ అబ్బురపరిచింది. విద్యార్థులను చినగదిలి మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రవీంద్రబాబు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు, ఉపాధ్యాయులు కె.ఝాన్సీ లక్ష్మీబాయి, కె.పూర్ణకుమారి, పి.రేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తానాం ప్రభుత్వ పాఠశాలలో..

పరవాడ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని తానాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంకే శ్రీదేవి అన్నారు. తానాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు దోహదపడే చెట్లు ప్రాముఖ్యతపై విద్యార్థులు నృత్య రూపం ప్రదర్శించారు. గిరిజన గ్రామాల్లో ప్రదర్శించే ధింసా నృత్యాన్ని విద్యార్థులు చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీజీఈఏ పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా యూనిట్ మర్యాదపూర్వకంగా కలిసింది. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షుడు జీవీ రమణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బాబూరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పి.అప్పారావు, కార్యవర్గ సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, జిలాని, నక్కపల్లి యూనిట్ సభ్యురాలు గిరిజా జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మర్రిపాలెం రైతుబజారును సందర్శించిన డీఎస్‌వో



రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశ్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారును గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సూర్యప్రకాశ్ సందర్శించారు. బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్పెషల్ కౌంటర్‌లో విక్రయాలను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నందున, వినియోగదారుల సౌలభ్యం జిల్లాలోని అన్ని రైతుబజార్లలో స్పెషల్ కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉంటే, రైతుబజారులో రూ.160కే అందిస్తున్నట్లు చెప్పారు. రోజు వారీ అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

విధి నిర్వహణలో భద్రత తప్పనిసరి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మల్కాపురం : విధుల నిర్వహణలో ప్రతి కార్మికుడు భద్రత పాటించాలని సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. హెచ్‌పీసీఎల్‌లో గురువారం జరిగిన భద్రత అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ జిల్లా జడ్జి, పర్మినెంట్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సర్వీస్ చైర్మన్ వల్లభనాయుడు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్ వాడపల్లి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్ తదితరులు కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సదస్సులో కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. బాలాజీ గార్డెన్స్, సింహాచలం ఆర్టీసీ డిపో, సింహాద్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2.. 33/11 కేవీ అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పీఎంఐ వర్క్స్‌లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీయర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పరవాడ ప్రాంతంలో...

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో దేశపాత్రునిపాలెం ఫీడర్‌లో చేపట్టనున్న విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా దేశపాత్రునిపాలెం, సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఏరియా, ఎస్సీ కాలనీ, శేషాద్రినగర్ శివారు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మల్కాపురం: వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు హెచ్చరించారు. శ్రీహరిపురం కూడలిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపిన వారికి ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ఎదురయ్యే ప్రమాదాలు, కుటుంబ సభ్యులు పడే ఇబ్బందులను వివరించారు. తొలి తప్పుగా విడిచిపెడుతున్నామని, నిబంధనలు మీరకుండా వాహనాలు నడపాలని చోదకులకు ఎస్‌ఐ సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. సంపత్‌కుమార్‌ను గురువారం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సహాయ సహకారాలు అందించాలని, పనుల నాణ్యతలో రాజీ పడకూడదని కాంట్రాక్టర్లకు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, గౌరవ అధ్యక్షుడు వి. సత్యనారాయణ, అధ్యక్షుడు గొంప చంద్రమౌళి, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, బి. రామానాయుడు, సలహాదారులు పైలా కృష్ణారావు, నాగరాజు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, ఎంవీ సత్యనారాయణ, గణేష్, రాంబాబు, సభ్యులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలి
- పోలీసులకు సీపీ శంఖబ్రత బాగ్చి సూచన

పెందుర్తి: సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఫిర్యాదులతో వచ్చిన ఇరు పక్షాల వాదనలు విని..తగిన విచారణ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయకుండా అక్కడ మొక్కలు నాటాలన్నారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి..పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని..పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్నా చెప్పాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, వృత్తి పరంగా ఏ సమస్య ఉన్నా 79950 95799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ విభాగం అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. విధుల నిర్వాహణలో ఎవరు బాధ్యతారహితంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్‌ఐలు అసిరి తాత, నరసింహరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం



పరవాడ సినిమాహాలు కూడలిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టని బడ్జెట్‌లో ఏపీతో పాటు ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాలు కూడలిలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్యం తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. పదేళ్ల నుంచి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయకపోగా స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయింపు లేవన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లను వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడం చూస్తే..అప్పులుగానే బావించాల్సి ఉంటుందన్నారు. బీజేపీతో దోస్తీ కట్టిన టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యాయని గనిశెట్టి దుయ్యబట్టారు. రైతాంగానికి అవసరమైన ఎరువుల రాయితీకి పెద్ద ఎత్తున కేటాయింపులు తగ్గించారన్నారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని గనిశెట్టి ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, శ్రీను, అప్పారావు, రమణ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తరశత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రభుత్వ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



మానవహారం నిర్వహిస్తున్న పీడీఎస్‌వో ప్రతినిధులు, విద్యార్థులు



కళాశాలలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ జూనియస్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి డిమాండ్ చేశారు. కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పీడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రుద్రి మాట్లాడుతూ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి రాత్రి సమయంలో రక్షణ కోసం తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్(పీడీ), ఎకనామిక్స్ అధ్యాపకులను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలను రెగ్యులర్ చేయాలని..ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులను నిర్మించాలని కోరారు. పెందుర్తి పట్టణంలో బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వం నిర్మించాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల నుంచి పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. పీడీఎస్‌వో ప్రతినిధులు కార్తీక్, మహేంద్ర, మోహన్, రాజేష్, గణేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.